క్లుప్తంగా

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



వినుకొండ(నూజెండ్ల): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నియోజకవర్గ ప్రజలకు భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పండుగలు ప్రతి ఒక్కరి జీవితాల్లో భోగభాగ్యాలను సుఖసంతోషాలను చేకూర్చాలని, నియోజకవర్గ ప్రజలందరూ పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి గ్రామీణ క్రికెట్ పోటీలు ప్రారంభం



నూజెండ్ల: మండలంలోని కొత్త జడ్డవారిపాలెంలో పార్డ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి గ్రామీణ క్రికెట్ పోటీలను ఏపీ ఎస్టీ కమిషన్ మాజీ సెక్రటరీ సతీష్ సావిత్రి సారెల్లా శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్డ్ అధ్యక్షులు డాక్టర్ పారా వెంకట లక్ష్మయ్య, గుర్వనాయుడుపాలెం సొసైటీ చైర్‌పర్సన్ పారా వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు జి.పున్నారావు, ముత్తినేని సుజాత సుబ్బారావు, తప్పెట్ల కోటేశ్వరరావు, పరిమి శేషయ్య, పారా ఆదినారాయణ, జి.శ్రీనివాసరవు, అమరా సత్యనారాయణ పాల్గొన్నారు.

తిరువాభరణములకు అభిషేకాలు



నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లిరోడ్డులోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో శనివారం స్వామివారి తిరువాభరణములకు నవవిధ అభిషేకాలను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో శనివారం స్వామికి నిర్వహించనున్న తిరువాభరణ మహోత్సవాన్ని పురస్కరించుకొని స్వామికి వెండి ఆభరణాలకు అభిషేకాలు నిర్వహించారు. ఆభరణాలను శనివారం ఎస్ఎస్‌పీ కాలనీ శివాలయం వద్ద నుంచి అత్యంత వైభవంగా సత్తెనపల్లిరోడ్డులోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయానికి భక్తులు మోసుకొచ్చి స్వామికి అలంకరిస్తారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తూరి వెంకట శివవేణుగోపాల్, కార్యదర్శి చేబ్రోలు ఫణికుమార్, కోశాధికారి ధనుంజయ్, గౌరవాధ్యక్షుడు గంధం వెంకట సూర్యనారాయణ, వాసవి మిత్ర మండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సినిమా చూస్తూ వ్యక్తి మృతి



చిలకలూరిపేట టౌన్: సినిమా చూస్తూ గుర్తు తెలియని మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్‌లో తాజాగా విడదలైన వాల్తేరు వీరయ్య సినిమా చూస్తూ మృతి చెందాడు. ఇది గమనించిన ప్రేక్షకులు థియేటర్ యాజమాన్యానికి సమాచారం అందించగా, అర్బన్ పోలీసుకు ఫిర్యాదు చేశారు. వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 9154880715, 9440796227కు సమాచారం అందించాలని కోరారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

శావల్యాపురం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎస్ఐ గల్లా రవికృష్ణ కోరారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషను ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్ఐ మాట్లాడుతూ మొక్కలు పెంచడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు దోహదం చేసినట్లు అవుతోందని చెప్పారు. ఆయనతోపాటు రైటరు కిరణ్ ఉన్నారు.

నేడు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంటు శనివారం 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించనున్నారు. వివరాలకు 7036653738, 9553967342 సంప్రదించాలని కోరారు.

జీవితాల్లో వెలుగులు నింపేలా జగనన్న పాలన

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపేలా ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ఆదర్శవంతమైన పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని 32వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మంత్రి విడదల రజిని ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలను కులం, మతం, ప్రాంతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికి ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఆయా పథకాలను అందజేస్తున్నదని వెల్లడించారు. రాష్ట చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతోందని చెప్పారు. ప్రజల కష్టాలు తెలిసిన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని పేర్కొన్నారు. వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేని విధంగా పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించటమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తున్నదని వివరించారు. మరోవైపు నాడు–నేడు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వార్డు కౌన్సిలర్ బిట్రా రాజేంద్రప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ బొల్లెద్దు చిన్నా, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాయకులు కసనానాయక్, ప్రగడ రామకోటేశ్వరరావు, పాలడుగు శివపార్వతి, అవ్వారు అన్నపశెట్టి, ఊట్ల సాంబమూర్తి, ప్రగడ రవికుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి సంబరాలు



చిన్నారులకు భోగి పండ్ల కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కౌన్సిలర్ షేక్ షకీలా

వినుకొండ టౌన్: సంక్రాంతి పర్వదిన వేడుకలలో భాగంగా పట్టణంలోని ఏ సెక్టార్ పరిధిలోని సంజీవ గాంధీ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు భోగి పండ్ల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గుంటి ఆంజనేయ స్వామి బజారు, సంజయ్ గాంధీ నగర్ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారులకు భోగి పండ్ల కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథిగా కౌన్సిలర్ షేక్ షకీలా, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ డి.మరియకుమారి పాల్గొన్నారు. అంతరం ఆమె మాట్లాడుతూ భోగి పండుగ విశిష్టతను, చిన్నారుల బంగారు భవిష్యత్ కోసం అంగన్‌వాడీ కేంద్రాల దోహదపడతాయని వివరించారు.

శావల్యాపురం: సంక్రాంతి సంబరాలు జరుపుకోవటం సంస్కృతులు సంప్రదాయాలకు నిలయమని ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో వలంటీర్లు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు షేక్ జాన్‌సైదులు పాల్గొని మాట్లాడుతూ ఇలాంటి వేడుకలు జరుపుకోవటం ద్వారా భవిష్యత్ తరాల వారికి ఆదర్శంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పి.సుగుణ, ఏపీఎం వీవీ రాజు పాల్గొన్నారు.

బాలబాలికలకు ఆటల పోటీలు



బహుమతులు అందుకున్న చిన్నారులతో నిర్వాహకులు

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడులో సంక్రాంతి పురస్కరించుకుని పలు సాంస్కృతిక, ఆటల పోటీలు నిర్వహించారు. స్థానిక కంసాలి బావి సెంటర్లో బాలబాలికలకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కుండకొట్టుట, మ్యూజికల్ చైర్స్, లెమన్‌అండ్ స్పూన్, ఉండమ్మా బొట్టుపెడతా విభాగాల్లో విజేతలకు సినీ నటులు ముత్తవరపు పద్మారావు, ముత్తవరపు సురేష్‌బాబు, జరుగుల శంకరరావు బహుమతులను అందజేసి ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాలను ముత్తవరపు భరద్వాజ్, పి.కృష్ణతేజ, ఎస్.జగదీష్, హేమంత్, ఎం.తరుణ్, ఆకాష్, నూతలపాటి కాళిదాసు పర్యవేక్షించారు.

తృష్ణకు తృతీయ బహుమతి



దేవదానం, చిత్రకారుడు



తృతీయ బహుమతి పొందిన తృష్ణ చిత్రం

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీలలో పట్టణానికి చెందిన గర్నేపూడి దేవదానంకు తృతీయ బహుమతి లభించింది. క్రియేటివ్ ఫైనార్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో గుంటూరులో గత డిసెంబర్‌లో నిర్వహించిన పోటీలలో ఎదురు చూపులు చూస్తున్న దుప్పి తృష్ణ చిత్రానికి గాను ఈ బహుమతి లభించినట్లు వివరించినట్టు దేవదానం తెలిపారు. గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న బహుమతి ప్రదానోత్సవ సభలో ప్రగతి చిత్ర కళా అవార్డుతో సత్కరిస్తారని వివరించారు. అవార్డు సాధించిన దేవదానాన్ని చిత్రకారులు ఇస్రాయేలు, దాస్తు జార్జి, బాషా, రాజు అభినందించారు.

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం



ఆలయంలో శ్రీగోదాదేవి, శ్రీరంగనాథస్వామి వార్ల కల్యాణ వేడుక



రాజుపాలెం వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

రాజుపాలెం: రాజుపాలెంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీగోదారంగనాథుల కల్యాణ మహోత్సవం రంగరంగ వైభవంగా శుక్రవారం నిర్వహించారు. వేదపండితులు రవితేజాచార్యులు, హస్వంత్ దీక్షితులు వేదమంత్రాలతో, మంగళవాయిద్యాల మధ్య కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో దేవస్థానం ధర్మకర్తలు పొత్తూరి సుబ్బారావు, వెంకటరమణ దంపతులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని కల్యాణం నిర్వహించారు. సుమారు 25 మంది దంపతులు పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, భజనా కార్యక్రమాలు నిర్వహించారు.

మొక్కులు తీర్చుకున్న ప్రభుత్వ విప్ జంగా...

వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కల్యాణం అనంతరం శాసన మండలిలో ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి ప్రత్యేక మొక్కలు తీర్చుకున్నారు. దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ పొత్తూరి వెంకటరమణసుబ్బారావు, పూజారి కిషోరాచార్యులు జంగాను వేద మంత్రా నడుమ పూర్ణకుంభంతో దేవస్థానంలోకు ఆహ్వానించారు. జంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, పూజారి తీర్థప్రసాదాలు అందించారు.

గోదాదేవి, శ్రీరంగనాథస్వామి వార్ల..

నకరికల్లు: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో శ్రీగోదాదేవి, శ్రీరంగనాథ స్వామివార్ల కల్యాణ వేడుక శుక్రవారం కన్నుల పండువగా జరిపించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణ వేడుక కమనీయంగా సాగింది. పలువురు దంపతులు పీటలపై కూర్చొని కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ధనుర్మాసం పురస్కరించుకుని అర్చకులు కొండవటికంటి మధుసూధనాచార్యులు, పాండురంగాచార్యులు, శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామివార్లకు విశ్వక్షేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, హోమములు, అభిషేకాలు జరిపించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి పూజాధికాల్లో పాల్గొనాలన్నారు.

యడ్లపాడులో షటిల్ పోటీలు

యడ్లపాడు: సంక్రాంతి సందర్భంగా యడ్లపాడు హనుమాన్ షటిల్ యూత్ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కల్లూరి శ్రీనివాసరావు(వాసు), పోపూరి సుబ్బారావు, ముత్తవరపు వేణుగోపాల్ తెలిపారు. జూనియర్, సబ్‌జూనియర్ విభాగాల్లో బాలురు, బాలికలకు వేర్వేరు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

యడ్లపాడు: వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులంతా అక్కడ విద్యను అభ్యసించారు. ఏ, బీ సెక్షన్లు కలిపి 60 మంది విద్యార్థులు పదో తరగతిని కలిసి చదువుకున్నారు. 1988–89 విద్యా సంవత్సరంలో అభ్యసించి పాఠశాల నుంచి ఒంటరిగా వెళ్లిన వారందరూ ఇప్పుడు కుటుంబాలుగా మార్పు చెందారు. ఈనెల 14వ తేదీన తిరిగి కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. దీంతో పూర్వ విద్యార్థులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తిమ్మాపురం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

యడ్లపాడు: మండలంలోని తిమ్మాపురం పోలేరమ్మ తల్లి, సీతాలాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం వేడుకలు శుక్రవారం నిర్వహించారు. గ్రామస్తులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొంగళ్లు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం వివిధ రకాల ప్రసాదాలను వితరణ చేశారు.

సంక్రాంతి సంబరాలకు ఏర్పాట్లు

నాదెండ్ల: సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నుంచి మూడు రోజులపాటూ సంక్రాంతి సంబరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 14,15,16 తేదీల్లో మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, యువతకు గాలిపటాలు, టగ్ ఆఫ్ వార్ తదితర పోటీలు జరగనున్నాయి. తొలిరోజు భోగి మంటలతో ప్రారంభమై చివరి రోజు విజయవాడ కళాబృందం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. పోటీల్లో విజేతలకు లక్ష రూపాయలు విలువైన బహుమతులు అందించనున్నారు.

ముప్పాళ్లలో పంటకోత ప్రయోగం

ఈపూరు: మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో శుక్రవారం పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. ఈ ప్రయోగాన్ని గ్రామానికి చెందిన రైతు తుర్లపాటి నరసింహారావు పొలంలో చేపట్టారు. ఎకరానికి 43బస్తాలు దిగుబడి వస్తుందని అంచనా వేశామని ఏఈఓ అప్పారావు తెలిపారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వినుకొండ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత సచివాలయ సిబ్బంది, వలంటీర్లదేనని కౌన్సిలర్ షేక్ షకీలా పేర్కొన్నారు. పట్టణంలోని ఓబయ్య కాలనీలోని సచివాలయాన్ని శుక్రవారం సందర్శించారు.


మకర జ్యోతి దర్శనానికి ఏర్పాట్లు

వినుకొండ టౌన్: మకర సంక్రాంతిని పురస్కరించుకొని పట్టణంలోని మార్కాపురం రోడ్డులోని శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం వద్ద భక్తుల సౌకర్యార్థం మకర జ్యోతి దర్శనానికి ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ గుడివాడ గురునాథం తెలిపారు. ఈ నెల 14 సాయంత్రం 6.30 జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.

సచివాలయం తనిఖీ

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని ములకలూరు గ్రామ సచివాలయాన్ని ఎంపీపీ మేడం జయరామిరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ ప్రోగ్రామ్‌పై రివ్యూ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచి కంచర్ల కోటేశ్వరమ్మ బాబు, ఎంపీడీఓ షేక్ జిలానీబాషా, ఈఓపీఆర్‌డీ రవికుమార్ పాల్గొన్నారు.

నేడే ముత్యాలమ్మ తిరునాళ్ల



రాజుపాలెం: మండలంలోని అనుపాలెంకు తూర్పువైపున ఉన్న కొండపై కొలువుదీరిన ముత్యాలమ్మతల్లి కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి భక్తుల పాలిటి కొంగు బంగారం అంటూ కొలుస్తారు. ముత్యాలమ్మ తల్లిని జంట గ్రామాలైన అనుపాలెం, అంచులవారిపాలెంకు చెందిన గ్రామస్తులు కులదైవంగా పూజిస్తారు. దీనికి గాను అమ్మవారి దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి సుందరంగా తీర్చిదిద్దారు. రెండు గ్రామాల్లోని గృహాల్లో ఏ శుభకార్యం చేయాలన్నా ముందుగా ఆ దేవతకు మొక్కులు చెల్లించి ఆ పనిని ప్రారంభిస్తారు. ఈ ఆదిపరాశక్తికి ఏటా శతాబ్ది కాలం నుంచి సంక్రాంతి పండుగను పురస్కరించుకుని 14వ తేదీ శనివారం తిరుణాళ్ళ నిర్వహిస్తారు. పాడి పంటల భోగభాగ్యాలతో చల్లగా చూసే తల్లికి కుల మతాలకు అతీతంగా తొలి ధాన్యపుకంకులు పొంగళ్ల నైవేద్యంగా సమర్పించి చీరా, సారెలతో వాయిద్యాల నడుమ బోణాలను నెత్తిన పెట్టుకుని మొక్కులు తీర్చుకుంటారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి విద్యుత్ ప్రభలు కోలాటాలు, భజనలు, సాంసృతిక కార్యక్రమాలు అనేక ఉత్సవాలతో రాత్రంతా జాగారం చేస్తారు. ఈ తిరుణాళను ఎంతో వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లను సిద్ధం చేశారు.

భారీ బందోబస్తు......

తిరుణాళ్లలో ఎటువంటీ అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ ఎస్‌కె షఫీ ఆలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభలపై రాజకీయ పార్టీల జండాలు, నాయకుల ఫొటోలు, సినీ హీరోల చిత్రాలు ఫ్లెక్సీ బోర్డులు, అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే ప్రభల నిర్వాహకులపై చర్యలు చేపటతామని ఎస్ఐ హెచ్చరించారు.

పశుపోషణతో సుస్థిర ఆదాయం

- పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కాంతారావు
- నాదెండ్లలో పశువైద్యశాల సందర్శన

నాదెండ్ల: వ్యవసాయంతో పాటూ పశుపోషణతో రైతులు సుస్థిర ఆదాయం సాధించి ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కె.కాంతారావు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల పశు వైద్యశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. డి.డి. నర్సింహులు, ఏడీ వై.రాధాకృష్ణతో కలసి పశువైద్యశాలతో రైతులతో పశువిజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెలా ఒక పశు వైద్యశాలను సందర్శించనున్నట్లు చెప్పారు. రైతులతో ఆయన మాట్లాడుతూ, యాజమాన్య పద్ధతులు పాటిస్తూ కొన్ని మెలకువలు తెలుసుకుంటే పశువుల్లో పాల దిగుబడి పెంచుకుని తద్వారా మంచి ఆదాయం పొందవచ్చన్నారు. పశువుల్లో వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై వివరించారు. పెరటి కోళ్ళు, గొర్రెల పెంపకంతో సమగ్ర ఆదాయం పొందవచ్చన్నారు. పలువురు గొర్రెల పెంపకందారులు జీవాలకు వేసే పీపీఆర్‌వ్యాక్సిన్సు సమయానుకూలంగా అందటం లేదని, దీంతో వ్యాధులకు గురై జీవాలు మృతి చెందుతున్నాయని ఆయన దృష్టికి తెచ్చారు. వీటిపై స్పందిస్తూ పీపీఆర్ వ్యాక్సిన్సు అందుబాటులో ఉంచాలని స్థానిక పశువైద్యులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి దుద్దూకూరి ఏడుకొండలు పాల్గొన్నారు.

విగ్రహాల ఊరేగింపు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన కమిటీ సభ్యులు, గ్రామస్తులు
- మే నెలలో విగ్రహాల ప్రతిష్ట
- హాజరుకానున్న చిన్నజీయర్‌స్వామిజీ



రామాలయం వద్ద ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చిన విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

నాదెండ్ల: గణపవరంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రామాలయ నిర్మాణ పనులు తుదిదశకు చేరాయి. ఈ ఏడాది మే నెలలో విగ్రహ, ధ్వజస్తంభ, కలశ ప్రతిష్ఠకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిష్ఠించబోయే విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. తమిళనాడు మహాబలిపురంలో ప్రముఖ శిల్పి ఇందిరాపద్మనాభన్ రూ.10 లక్షల వ్యయంతో శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయుడు, కన్యకాపరమేశ్వరి, మూషిక, సింహ వాహన విగ్రహాలు, బలిపీఠాలను రూపొందించారు. వీటిని శుక్రవారం ప్రత్యేక వాహనంలో మహాబలిపురం నుంచి తీసుకురావటంతో గ్రామ పొలిమేరలో ప్రత్యేక పూజలు జరిపి గ్రామంలో డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. గతేడాది ఈ ఆలయానికి సంబంధించి నర్సీపట్నం అడవుల నుంచి టేకు ధ్వజస్తంభం తీసుకొచ్చి సిద్ధం చేశారు. మేలో జరిగే ప్రతిష్టా మహోత్సవానికి కంచి పీఠాధిపతి చిన్నజీయర్ స్వామి విచ్చేసేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామిజీ నిర్ణయించిన తేదిల్లో ప్రతిష్టా మహోత్సవం నిర్వహించనున్నారు.

ఫిబ్రవరి 11న మెగా లోక్ అదాలత్

వినుకొండ(నూజెండ్ల): ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎ.తౌషిద్ హుస్సేన్ శుక్రవారం తెలిపారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన సివిల్ వివాదాలు, క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మనోవర్తి, బ్యాంక్, ఫ్రీ లిటిగేషన్, కరెంటు బిల్లులు, టెలిఫోన్ బిల్లుల వివాదాలను రాజీ మార్గంలో పరిష్కరించుకోవచ్చన్నారు.

104 సేవలను సద్వినియోగించుకోవాలి

జిల్లా వైద్యాధికారి శోభారాణి



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ శోభారాణి

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలం విఠంరాజుపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న 104 వైద్యశిబిరాన్ని జిల్లా డీఎంహెచ్ఓ శోభారాణి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశిబిరాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 104 వైద్యశిబిరాలను సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీ రుగ్మతలతో పాటు సాధారణ జబ్బులకు కూడా 104 వైద్యశిబిరం అందజేస్తున్న సేవలను సద్వినియోగించుకోవాలని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనిటేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ పాల్గొన్నారు.